క్లుప్తంగా

ఓటరుగా నమోదు చేసుకోవాలి



కోస్గి: 18 సంవత్సరాలు నిండిన వారందరిని ఓటర్లుగా పేర్లు నమోదుచేయాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించే కార్యక్రమాలు, ర్యాలీలు, ఇతర అంశాలకు సంబంధించి బీఎల్ఓలకు సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐలు, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పథకాలు కొనసాగించాలి

మరికల్: పేదల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతయ్య, రామస్వామి, రాజేష్ అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులను ఆదుకోవడం కోసం అమలుచేసిన రైతుబీమా, రైతుబంధు, దళితబంధు అర్హులైన వారికి ఇళ్లు, గొర్రెల యూనిట్లు పథకాలను యథావిధిగా కొనసాగించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను కూడా త్వరగా అమలు చేయాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మాగనూర్: మండల పరిధిలోని మందిపల్లి గ్రామానికి చెందిన రాము అనే వ్యక్తి సోమవారం రాత్రి పూంజనూర్ గ్రామానికి ఇసుక అక్రమంగా తరలిస్తుండగా మార్గమధ్యంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అనుమానం వచ్చి ట్రాక్టర్లను తనిఖీచేయగా ఇసుక ఉండటంతో వెంటనే ట్రాక్టర్ల డ్రైవర్లను విచారించగా ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేని ఇసుకను తరలిస్తున్నట్లు తెలుసుకుని ట్రాక్టర్లను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయంపై రాజశేఖర్‌రెడ్డి కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ మల్లేష్ డ్రైవర్‌తోపాటు ట్రాక్టర్ల యాజమానులపై కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఆరుగురిపై కేసునమోదు

ఊట్కూర్: మండలంలోని కొల్లూర్‌లో గుడ్ సెఫార్డ్ పాఠశాల హెచ్ఎం విజయ్‌సాగర్‌తో గొడవపడ్డ ఆరుగురిపై కేసునమోదుచేసినట్లు ఎస్ఐ గోకారి మంగళవారం తెలిపారు. సోమవారం అయోధ్యలో రాముడి విగ్రహా ప్రతిష్ట సందర్భంగా పాఠశాలకు సెలవు ఇవ్వాలని గ్రామానికి చెందిన కొంతమంది యువకులు పాఠశాలకు వెళ్లి హెచ్ఎం విజయ్‌సాగర్‌ను అడిగారు. డీఈఓ అనుమతి ఉంటే పాఠశాలకు సెలవు ఇస్తానని తెలుపగా మాటమాట పెరిగి తోపులాట జరిగిందని తెలిపారు. వాచ్‌మెన్ రమేశ్ ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అలరించిన రామాంజనేయ నాటిక ప్రదర్శన



మరికల్: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో మంగళవారం తెల్లవారుజామువరకు జరిగిన శ్రీరామంజనేయ యుద్ధనాటిక ప్రజలను అలరించింది. అయోధ్యలో బాలరాముడి విగ్రహా ప్రతిష్ఠాపన సందర్భంగా మండలంలో రైతులు నిర్వహించిన ఈ నాటిక ప్రదర్శనలో పలువురు దేవతామూర్తుల వేషధారణలతో ప్రదర్శన చేసి ప్రేక్షకులను అలరించారు. వివిధ దేవత పాత్రల్లో చక్కగా అభినయం చేసిన వారిని గ్రామస్తులు అభినందించారు.

దర్శకుడు త్రివిక్రమ్ దిష్టిబొమ్మ దహనం

మక్తల్: గుంటూరు కారం సినిమాలో విలన్లకు ప్రపంచ మేధావులైన కారల్‌మార్క్స్ లెనిన్‌ల పేరు పెట్టడానికి నిరసిస్తూ పీడీఎస్‌యూ, పీవైఎల్‌పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం సినీదర్శకుడు త్రివిక్రమ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. వెంటనే ఆ పేర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. సినిమా తమ లాభాలకోసం ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధు, ఈశ్వర్, శారద, అజయ్, మహదేవి, సావిత్రమ్మ, ఆనంద్, రాజు పాల్గొన్నారు.

బీటీ రహదారిగా మారేది ఎన్నడో..

అమరచింత: మండల కేంద్రం నుంచి మస్తీపురం గ్రామానికి వెళ్లడానికి వీలుగా ఉన్న కచ్చ రహదారిని బీటీ రహదారిగా మార్చమని గత పాలకులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని ఇరు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అమరచింత బీసీ కాలనీలోని పద్మశాలి భవనం నుంచి మస్తీపురం గ్రామానికి అడ్డదారి తాతల కాలం నుంచి ఉందన్నారు. కేవలం మూడు కిలో మీటర్ల దూరంలో మస్తీపురం గ్రామానికి చేరుకునే అవకాశం ఉందన్నారు.

ప్రోత్సాహక నిధులు హుళక్కేనా?

- పంచాయతీలకు ఏళ్లు గడుస్తున్నా అందని నజరాన
- కనీస వసతులు సమకూర్చుకోలేని కొత్త పాలకులు
- పాలకవర్గాల గడువు సమీపిస్తున్న విడుదల కాని నిధులు



గుంతలుపడ్డ లక్కర్‌దొడ్డి రహదారి



కొత్తపల్లిలో మూతపడ్డ తాగునీటి శుద్ధి కేంద్రం

నర్వ: గ్రామ మంతా ఒకే మాటపై నిలబడి పంచాయతీ పాలకవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహంతోనే గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని ఎన్నుకున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్న పాలకులు ఎన్నికై రెండేళ్లకు పైగా గడుస్తున్నా నజరాన మాత్రం అందక అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడిందని పాలకులు వాపోతున్నారు.

మండలంలో ఏకగ్రీవ పంచాయతీలు..

గత నాలుగేళ్ల క్రితం రాష్ట్రంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మండలంలో మొత్తం 15పంచాయతీలుండగా ఇందులో కొత్తగా నాలుగు పంచాయతీలు ఏర్పడ్డాయి.. ఇందులో కొత్తపల్లి, లక్కర్‌దొడ్డి, ఎల్లంపల్లి, సీపురం పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.

ఏకగ్రీవ నిధుల జాడేది..

ఏకగ్రీవంగా పంచాయతీల పాలకవర్గాన్ని ఎన్నుకుంటే ప్రోత్సాహకంగా పంచాయతీకి రూ.10లక్షలు నిధులు ఇస్తామని గత ప్రభుత్వం ప్రకటించారు. దీంతోపాటు నియోజకవర్గ ఎమ్మెల్యే నిధుల నుంచి రూ. 5లక్షలు అదనంగా ఇచ్చేందుకు మార్గదర్శకాలను రూపొందించారు. ఈ నేపథ్యంలో గడిచిన కాలంలో పంచాయతీలకు ఒక్కరూపాయి నజరాన నిధులు అందలేదన్నది పాలకుల ఆవేదన. పంచాయతీ పాలకుల పదవీకాలం ముగిసిన ఈ నిధుల జాడలేదని వారు వాపోతున్నారు.

నిధులు మంజూరు చేసి ఆదుకోవాలి..



తెలంగాణ ప్రభుత్వం కొత్త పంచాయతీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టి తమ చిన్న పంచాయతీలకు కొత్త పాలకవర్గాలను ఎన్నుకోవడం హర్షణీయం. గతంలో ఉమ్మడి గ్రామ పంచాయతీల్లో ఏలాంటి అభివృద్ధికి నోచుకోలేదు.

\- శివన్న సర్పంచ్, లక్కర్‌దొడ్డి గ్రామం

అభివృద్ధి చేస్తాం..



ఏకగ్రీవంగా గ్రామస్తులు తనపై నమ్మకం ఉంచి సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు లేక పనులు చేయలేక పోతున్నాం. ఏకగ్రీవ నిధులు రూ.10 లక్షలు మంజూరు చేస్తే గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతాం.

\- సుజాత, సర్పంచ్ కొత్తపల్లి

నిధుల మంజూరుపై నివేదించాం..

ఏకగ్రీవంగా ఎన్నుకున్న పంచాయతీకు ఇవ్వాల్సిన నజరాన నిధులపై ఉన్నాతాధికారులకు నివేదించాం. ప్రస్తుతం పాత పంచాయతీలకు వచ్చే నిధులన్ని కొత్త పంచాయతీలకు వస్తున్నాయి. దీంతో అభివృద్ధి పరంగా ఎలాంటి ఇబ్బందులు లేవు. కొత్త పంచాయతీలో పాలక భవనాల మంజూరు చేసి పనులు పూర్తిచేశాం. ఏకగ్రీవ నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపించాం.

\- సుదర్శన్, ఎంపీడీఓ, నర్వ

సామాజిక తనిఖీ పకడ్బందీగా నిర్వహించాలి



సమీక్షాసమావేశంలో పాల్గొన్న అధికారులు

మాగనూర్: గ్రామాల్లో ఉపాధిహామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ శశికళ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీపై ఉపాధిహామీ సిబ్బంది, ఎస్ఆర్‌పీలతో సమావేశం నిర్వహించారు. 2022–23 సంవత్సరానికి సంబంధించి ఆయా గ్రామాల్లో చేపట్టిన పనులపై బుధవారం నుంచి సామాజిక తనిఖీ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రూ. 2కోట్ల 10లక్షల రూపాయల పనులు చేపట్టినట్లు తెలిపారు. రోడ్లు, హరితహారం, క్రీడా ప్రాంగణం తదితర పనులు చేపట్టడం జరిగిందన్నారు. వీటికి సంబంధించి గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల వివరాలు సేకరించనున్నట్లు తెలిపారు. వీరికి టీఏ, ఎఫ్‌లతోపాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటయ్య, డీఆర్‌పీ నాగిరెడ్డి, ఎస్ఆర్‌పీ శ్రీనివాసులు, ఎంపీఓ జైపాల్‌రెడ్డి, ఏపీఓ సత్యప్రకాష్, టీఏలు మానిక్‌రావు, హర్షవర్ధన్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం



ఊట్కూరు: మండలంలోని జీపీఎస్ పాఠశాలలో ఆంగ్లం బోధిస్తున్న అనిత అనే ఉపాధ్యాయురాలికి పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. రెండు రోజుల క్రితం ఆంగ్ల భాషపై రిసోర్స్‌పర్సన్‌గా ఉపాధ్యాయులకు ఆంగ్లబోధనలో మెలుకువలు చెప్పడంతో కలెక్టర్ ప్రశంసాపత్రం అందజేశారు. ఈ విషయమై పీఆర్‌టీయూ తరుపున ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, హెచ్ఎం శ్రీవిద్య, ఉపాధ్యాయులు గోవర్ధన్, సునంద, భ్రమరాంబ, శశిరేఖ పాల్గొన్నారు.

12మంది బడి బయటి పిల్లల గుర్తింపు



బడిబయట పిల్లల వివరాలు నమోదు చేస్తున్న సీఆర్పీ

కోస్గి: డీఈఓ ఆదేశాల మేరకు మంగళవారం సీఆర్‌పీలు బడిబయటి పిల్లల సర్వే నిర్వహించారు. మండల పరిధిలో ఇటుక బట్టీలు, పత్తిచేలు, ఇతర పని ప్రదేశాల్లో సీఆర్పీలు ఆయా ప్రదేశాలకు వెళ్లి పిల్లల వివరాలు సేకరించారు. ఒకేరోజు 12మంది బడి బయటి పిల్లలను గుర్తించి వారి పూర్తి వివరాలు సేకరించి నమోదుచేశారు. గుర్తించిన 12మంది విద్యార్థులను వయస్సు ఆధారంగా సమీప పాఠశాల లేదా ఓపెన్ స్కూల్‌లో చేర్పించనున్నట్లు సీఆర్పీ పద్మావతి తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు బాల్‌రాజ్, జియోద్దీన్ ఉన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం



నర్వ: శ్రీ అయోధ్య రామమందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ఎల్లంపల్లిలో మంగళవారం ఇన్విటేషన్ కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను సర్పంచ్ చెన్నప్ప, ఉప సర్పంచ్ నాగరాజు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మన్న, దాత దండు అయ్యప్ప రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలో గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు రఘుపతిరెడ్డి, వెంకటయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఆలయానికి మైక్‌సెట్ వితరణ



మైక్‌సెట్‌ను వితరణ చేస్తున్న దాతలు

నర్వ: మండలంలోని రాయికోడ్‌లో మంగళవారం శ్రీ ఆంజనేయస్వామి ఆలయానికి దాత కొండ నర్సింహ, విజయ్ మైక్‌సెట్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆలయ అర్చకులకు ఈ మైక్‌సెట్‌ను వారి తండ్రి కీ.శే కొండ రాఘవులు జ్ఞాపకార్థంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్తులు వారిని అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ జయరాములుశెట్టి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

నేతాజీ జీవితం యువతకు ఆదర్శం



నారాయణపేటలో నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నారాయణపేట రూరల్: నేటి యువత నేతాజీ సుభాష్ చంద్రబోస్ వంటి దేశ భక్తులుగా ఎదగాలని బీజేపీ రాష్ట్ర నాయకులు నాగురావునామాజీ అన్నారు. పట్టణంలోని మోసల్‌లో ఏర్పాటు చేసిన నేతాజీ విగ్రహానికి మంగళవారం ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు, యువతకు నేతాజీ ఎంతో ఆదర్శణీయుడని, ప్రతి ఒక్కరూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. అదేవిధంగా వివిధ పార్టీల నాయకులు, ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ కార్యకర్తలు బోస్ విగ్రహానికి నివాళి అర్పించారు. అలాగే తపస్ ఆధ్వర్యంలో పరాక్రమ దివాస్ నిర్వహించారు. ఆయాకార్యక్రమాల్లో రంతగపాండురెడ్డి, శ్రీనివాసులు, రఘువీర్‌యాదవ్, అనుష, రాము జగదీష్, నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతయ్య, రవికుమార్, శ్యామ్, రామకృష్ణ, రాములు, వెంకటేష్, నర్సప్ప పాల్గొన్నారు.

మక్తల్: పట్టణంలోని మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం పురవీధుల గుండా ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏబీవీపీ అధ్యక్షుడు అంజిరెడ్డి, వంశీ, వినయ్, సురేష్, నితిన్, నర్సింహ, రాజు, జగదీష్ పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మండలంలోని నిడుగుర్తి, చిన్నపొర్ల, బిజ్వార్, తదితర పాఠశాలల్లో నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పద్మ, అనిత, వెంకటప్ప పాల్గొన్నారు.

కృష్ణా: సుభాష్ చంద్రబోస్ జయంతి పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ మేరకు.. ముదుమాల హెచ్ఎం నిజాముద్దీన్ మాట్లాడుతూ.. నేటి తరానికి సుభాష్ చంద్రబోస్ ఆదర్శప్రాయుడని విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో ఆత్మస్థైర్యంతో ఆయన అడుగుజాడల్లో పయనించాలన్నారు.

మరికల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నతపాఠశాల ఆవరణలో మంగళవారం యువక మండలి ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ నేతాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు నేతాజీ జీవిత చరిత్రపై క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోవర్ధన్, యువక మండలి అధ్యక్షుడు రవికిరణ్, ఎంపీటీసీ గోపాల్, రాజేష్, మనోరంజిని, రఘు, వెంకటేష్, రాజు, పట్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు.



ఊట్కూర్‌లో



మక్తల్‌లో ..



నారాయణపేటలో తపస్ ఆధ్వర్యంలో ..

మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీఈఓ ఘని

నారాయణపేట రూరల్: టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఫిబ్రవరి 11, 12 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించే రెండోమహాసభల వాల్‌పోస్టర్‌ను మంగళవారం డీఈఓ అబ్దుల్‌ఘని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని, పాఠశాలలో భావిభారత పౌరులను తీర్చిదిద్దుతున్న గురువు సమయపాలన పాటించి చక్కటి విద్యాబోధన చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచుతూ టెన్త్‌లో చక్కటి జీపీఏతో వందశాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలోనే జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలన్నారు.

సమాన విద్యకోసం పోరాటం

అంతరాలు లేని సమాన విద్యకోసం పోరాటం చేస్తామని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నారాయణమ్మ అన్నారు. వాల్‌పోస్టర్ విడుదల అనంతరం విలేకరులతో మాట్లాడారు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో విద్యారంగం వెనకబాటుకు గురవుతుందని విమర్శించారు. ఖాళీలను భర్తీచేసి పాఠశాల వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎంఓ విద్యాసాగర్, ఎస్ఓ నాగార్జున్‌రెడ్డి, టీపీటీఎఫ్ నాయకులు రెడ్డప్ప, దశరథ్, రమేష్, రామకృష్ణ, గజలప్ప, వాల్యానాయక్, దేవేంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీల సమస్యలు పరిష్కరిస్తాం



పుట్టింటి చీరను అందుకుంటున్న ఎమ్మెల్యే

ధన్వాడ: మండల కేంద్రంలోని సమస్యలపై మంగళవారం ఇంటింటి పర్యటన చేసిన ఎమ్మెల్యే పర్ణికారెడ్డికి గ్రామస్తులు పుట్టింటి చీర అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఇంటింటికి వెళ్లి గ్రామ సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని గ్రామస్తులకు హామీచ్చారు. గత కొన్నాళ్ల నుంచి పద్మశాలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మత్స్య సహకార సంఘం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యేకు మహిళలు పుట్టింటి చీరాన్ని అందజేసి మమకారం చాటుకున్నారు. కార్యక్రమంలో కుంభం శివకుమార్‌రెడ్డి, నరహరి, వెంకట్రామారెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

నర్వ: సోషల్‌మీడియాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కురుమయ్య అన్నారు. మంగళవారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎస్పీ ఆదేశాల మేరకు సోషల్‌మీడియాలో అభ్యంతకరమైన పోస్టులు పెడితే పెట్టిన వారిపై, అడ్మిన్‌లపై కేసులు నమోదు చేస్తామన్నారు. కోస్గీలో నిర్వహించిన శోభాయాత్రలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘటనపై 7మందిపై కేసునమోదు చేసినట్లు తెలిపారు. మరికొంతమందిపై విచారణ చేస్తున్నామని సంబంధిత వీడియోల ఆధారంగా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అన్నిమతాల వారు శాంతియుతంగా ఉండి సోదరాభావం కలిగి ఉండాలన్నారు.

వైభవంగా ఎల్లమ్మ జాతర



జాతరకు హాజరైన స్వకులసాలి సమాజ్ సభ్యులు

నారాయణపేట రూరల్: పట్టణంలోని కొండారెడ్డిపల్లి చెరువు సమీపంలో ఎల్లమ్మతల్లి జాతర ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వకులసాలి సమాజ్ ఆధ్వర్యంలో స్థానిక మర్గమ్మ గుడి నుంచి భక్తిశ్రద్ధలతో పల్లకిసేవను నిర్వహించారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, మహానైవేద్యం సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సమాజం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

సరస్వతిమాత విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో పాల్గొన్న నాయకులు

నారాయణపేట రూరల్: మండలంలోని కొల్లంపల్లిలో మంగళవారం సరస్వతిమాత విగ్రహావిష్కరణ నిర్వహించారు. స్థానిక కేశవ శిశుమందిర్ స్కూల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నాగురావునామాజీ హాజరై అమ్మవారి విగ్రహానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు సరస్వతి మాత మాత కటాక్షం ఉండాలని, చక్కటి విద్యాబుద్దులు నేర్చుకోవాలని సూచించారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వెంకట్రాములు, రాంరెడ్డి, చంద్రశేఖర్, హెచ్ఎం లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

మరికల్: సమాచార హక్కు వికాస సమితి క్యాలెండర్‌ను మంగళవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ నవీన్ మిట్టల్ ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, వికాస సమితి సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వికాస సమితి జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్, జిల్లా కన్వీనర్ వెంకటేష్, నర్సింహులు, వెంకట్రాములు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

ఊట్కూరు: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం మండలంలోని అమీన్‌పూర్‌లో సర్పంచ్ యశోదమ్మ భర్త కీ.శే వెంకట్‌రెడ్డి వారి కుమారులు కీ.శే నర్సింహారెడ్డి జ్ఞాపకార్థం సరస్వతి మాతా విగ్రహాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో చదువుల తల్లి సరస్వతి దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం ఎంతో సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యశోదమ్మ, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ఎల్కోటి నారాయణరెడ్డి, బస్వరాజ్‌గౌడ్, కార్తీక్‌రెడ్డి, ఎంపీటీసీ అనిత పాల్గొన్నారు.

ముగిసిన ఉర్సు

అమరచింత: మండలంలోని మస్తీపురం గ్రామ శివారులోని గుట్టలపై వెలసిన శ్రీసయ్యద్ షా హాజీమ లాంగ్ బాబ ఉర్సు మంగళవారం ఘనంగా ముగిసింది. మూడు రోజుల పాటు కొనసాగుతున్న ఉర్సు వేడుకలు మంగళవారం ఖత్మేఖురాన్ ఫాతేహా నిర్వహించారు. భక్తులు భక్తి శ్రద్ధలతో దర్గాకు చాదర్లను సమర్పించారు. దర్గా ప్రాంగణంలో పొటేళ్లను బలిచ్చి కందూర్‌లు నిర్వహించి తమ తమ మొక్కులు తీర్చుకున్నారు.